క్లుప్తంగా

మునగపాకలో నేడు వరి విత్తనాల పంపిణీ

మునగపాక : మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో బుదవారం రైతులకు వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సంఘ ఆవరణలో జరిగే కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

రాంబిల్లి : విద్యతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన రాంబిల్లి ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ఎం.సూర్యారావు, వి. సూర్యనారాయణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుందరపునకు సత్కారం



ఎమ్మెల్యే విజయకుమార్‌ను సత్కరిస్తున్న శ్రీ వెంకటేశ్వర పల్లకికమిటీ సభ్యులు

మునగపాక: యలమంచిలి ఎమ్మెల్యేగా ఎన్నికైన సుందరపు విజయకుమార్‌ను నాగులాపల్లికి చెందిన శ్రీ వెంకటేశ్వర స్వామి పల్లకి కమిటీ సభ్యులు మంగళవారం సత్కరించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయకుమార్ కూటమి నుంచి గెలుపొందిన సందర్భంగా పల్లకి కమిటీ వ్యవస్థాపకులు కర్రి వాసు, కన్నుంనాయుడు, కాండ్రేగుల ఈశ్వరరావు శాలువాతో కప్పి సత్కరించారు.

మలేరియా నివారణ మాసోత్సవాలు



మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాయకరావుపేట : మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలో గల పి.ఎల్ పురం గ్రామంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యాధి వ్యాప్తి విధానాల గురించి ప్రజల్లో పూర్తిగా అవగాహన కల్పించారు. వ్యాధి సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. పాయకరావుపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ వి.ఎస్.సౌందర్య ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో ఎంపీహెచ్‌ఓ పి.వి.రమణ, ఎంపీహెచ్ఎస్ ఎం.నాగేశ్వరరావు, ఎంపీహెచ్ఏ సురేష్ నెహ్రూ, సీహెచ్‌వో కల్యాణి, ఏఎన్ఎం లక్ష్మి పాల్గొన్నారు.

వసతి గృహంలో దోమల మందు పిచికారీ



బీసీ వసతి గృహంలో పిచికారి చేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : వసతి గృహాల్లో విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో మెలగాలని సర్వసిద్ధి వైద్యాధికారి ఎస్.వాసంతి తెలిపారు. ఎస్.రాయవరం బీసీ వసతి గృహంలో ఏసీఎం 5శాతం ద్రావణాన్ని కలిపి వసతి గృహంలో మంగళవారం పిచికారి చేయించారు. కీటకనాశిని మందులు స్ప్రే చేయించి జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించారు. అనంతరం మలేరియా వ్యతిరేక మాసోత్సవాలపై అవగాహన కల్పించారు.



ఎండ నుంచి రక్షణ కోసం చున్నీ కప్పుకుని వెళుతున్న విద్యార్థినులు



చీర కొంగు రక్షణగా..

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

- మళ్లీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- తేమ శాతం తగ్గడంతో జనం అవస్థలు
- వేడి గాలులతో సతమతమవుతున్న ప్రజానీకం



నిత్యం రద్దీగా ఉండే పట్టణంలోని వైఎస్సార్ కూడలి ఇలా..

యలమంచిలి రూరల్ : ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోయాయి. వడగాలులు మళ్లీ ఉధృతమయ్యాయి.వెచ్చటిగాలులతో వాతావరణం నిప్పుల కొలిమిలా మారింది. రెండ్రోజులుగా ఉదయం 8 గంటల నుంచి సూర్యాస్తమయం తర్వాత కూడా వేడిగాలులు వీస్తూనే ఉన్నాయి.వాతావరణంలో తేమ శాతం తగ్గడంతో ఉష్ణోగ్రతలు పెరగడంతోపాటు ఉక్కపోతతో జనం సతమతమవుతున్నారు.రుతుపవనాల కదలిక మందగించడంతో పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. యలమంచిలిలో గడిచిన మూడురోజుల్లో సుమారు 5 నుంచి 6 డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. మధ్యాహ్నం పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే వైఎస్సార్, దిమిలి రోడ్డు కూడళ్లలో జనసంచారం పలుచబడింది. 16 వ నెంబరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు తగ్గాయి. ఎండ వేడికి తట్టుకోలేక పలువురు లారీ, వ్యాన్ల డ్రైవర్లు మధ్యాహ్న సమయంలో వాహనాలను నిలిపివేసి చెట్లు, పెట్రోల్ బంకుల్లో విశ్రాంతి తీసుకున్నారు. మరికొన్ని రోజులు ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసర పనులకు సైతం ఎండ సమయంలో బయట తిరగాలంటే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కపోత కారణంగా ప్రజలు అల్లడిపోతున్నారు. ఫ్యాన్లు తిరుగుతున్నా వేడి గాలి రావడంతో ఇళ్లలో ఉండలేని పరిస్థితితో నానా అవస్థలు పడుతున్నారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లు, తట్ట వ్యాపారులపై మండే ఎండల ప్రభావం అధికంగా పడింది.10 గంటలకే ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండడంతో వ్యాపారం చెసుకోలేని పరిస్థితి ఏర్పడింది. కొందరు పొట్టకూటి కోసం మండుటెండలోనే వ్యాపారం చేసుకుంటుండగా, ఎక్కువశాతం మంది ఉదయం 11 తర్వాత రోడ్లపై కనిపించడంలేదు. సాయంత్రం 5 గంటల తర్వాతే మళ్లీ వ్యాపారం మొదలుపెట్టుకుంటున్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

పెరిగిన ఎండలు, వేడి గాలుల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావడం మంచిది కాదని అటు డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.ఉదయం 11 గంటలలోపే పనులు చూసుకుని ఎండ తీవ్రత తగ్గిన తర్వాత సాయంత్రం 4 గంటల తర్వాత మాత్రమే బయటకు రావాలని సూచిస్తున్నారు.ఒకవేళ అవసరం రీత్యా బయటకు వచ్చినా తాగునీరు, ఓఆర్ఎస్ వంటివి అందుబాటులో ఉంచుకోవాలని,తలపై టోపీ లేదా గొడుగు వంటివి వినియోగించాలని సూచిస్తున్నారు.ఉపాధిహామీ పనులకు వెళ్లే ప్రజలు, వ్యవసాయ కూలీలు డీహైడ్రేషన్, వడదెబ్బ తగలకుండా తాగునీరు,కొబ్బరి నీళ్లు,ఓఆర్ఎస్,గ్లూకో,మజ్జిగ,పండ్ల రసాలు వంటివి తమవెంట తీసుకెళ్లడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లల పట్ల మరింత జాగ్రత్త వహించాలని, వడగాలులు, వేడి వాతారణానికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. ఎండ తీవ్రతకు తల తిరిగినా, నోరు పొడిబారిపోయినా వడదెబ్బ తగిలినట్టు అనుమానం వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని వైద్యులు సూచిస్తున్నారు.

ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి



వేసవికాలం ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవడం మంచిది. వడదెబ్బతో సొమ్మసిల్లి పడిపోతే వారికి ఎట్టిపరిస్థితుల్లో నీటిని ఇవ్వరాదు. వృద్ధులు, చిన్న పిల్లలు,గుండె వ్యాధి బాధితులు, షుగర్, కిడ్నీ బాధితులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు మరింత జాగ్రత్తలు పాటించాలి. ప్రజలు వేడి గాలులు, ఎండ తీవ్రత సమయంలో బయటకు రాకపోవడమే శ్రేయస్కరం. నోరు, శరీరం పొడిబారినా, కళ్లు తేలేసినట్టు ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ ఆర్. నిహారిక, అసిస్టెంట్ సివిల్ సర్జన్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, యలమంచిలి

పంపిణీకి 1799 క్వింటాళ్ల వరి విత్తనాలు



నాతవరం ఆర్బీకేలో వరి విత్తనాల స్టాకును పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

నాతవరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన వరి విత్తనాలను బుధవారం నుంచి పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేసినట్లు మండల వ్యవసాయాధికారి శైలజ తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రైతులకు కావాల్సిన విత్తనాలు అందించేందుకు ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. జిల్లాలో అధిక విస్తీర్ణంలో వరి సాగు చేసే రైతులు మండలంలోనే ఉన్నారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో తాండవ రిజర్వాయర్ ఆయకట్టు ఎక్కువగా ఉండటంతో ఖరీఫ్ సీజన్లో గరిష్టంగా వరి సాగు జరుగుతుందన్నారు. ఈ ఏడాది మండలంలో 1799 క్వింటాళ్ల వరి విత్తనాలు రైతులకు పంపిణీ చేసేందుకు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు ఇప్పటికే ఆర్బీకేల ద్వారా ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ముందుగా వారందరికీ అవసరమైన మేరకు విత్తనాలు అందిస్తామన్నారు. ఇంకా విత్తనాలు కావాల్సిన రైతులు స్థానిక ఆర్బీకేల రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు. బుధవారం ఉదయం నాతవరం ఆర్బీకే వద్ద ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో విత్తనాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘పర్తియాత్రకు సత్యసాయి భక్తులు తరలిరండి’

పుట్టపర్తిలో అక్టోబర్ 23 నుంచి 25 వరకు పర్తియాత్ర



వేచలంలో సత్యసాయి భక్తులతో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు

దేవరాపల్లి: పుట్టపర్తిలో అక్టోబర్ 23 నుంచి 25 వరకు జరిగే పర్తియాత్రకు అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా వేలాదిగా ఉన్న సత్యసాయి భక్తులు తరలిరావాలని భగవాన్ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని వేచలంలో మండల స్థాయి సత్యసాయి సేవా సమితి సమావేశం మంగళవారం జరిగింది. ముందుగా సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. అనంతరం కశిరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ పుట్టపర్తిలో ఏటా మాదిరిగా అక్టోబర్ 23 నుండి 25 వరకు పర్తి యాత్ర ఘనంగా జరుగనుందన్నారు. ఈ యాత్రకు అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చేలా కృషి చేయాలన్నారు. కుటుంబ నారాయణ సేవ, శ్రీ సత్యసాయి లక్ష గృహ నామ సంకీర్తన, గ్రామ సేవలు, భజనలు, బాల వికాస్ తరగతులు యథావిధిగా కొనసాగించాలని సూచించారు. సమావేశంలో విశాఖపట్నం జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త జక్కాన సూర్యనారాయణ, దేవరాపల్లి మండల సత్య సాయి సేవా సమితి నూతన అధ్యక్షుడు ఆదిరెడ్డి చినకన్నబాబు, నౌడు అప్పారావు, సీహెచ్‌వీ రవిశంకర్, గంధం సూర్యం తదితర సత్య సాయి సేవా సమితి ప్రతినిధులు, భజన మండలి కన్వీనర్లు, మహిళా సేవాదళ్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీపీఎం శిక్షణ తరగతుల్ని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న లోకనాథం

చోడవరం రూరల్: ఈ నెల 22, 23 తేదీల్లో చోడవరంలో జరప తలపెట్టిన సీపీఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతుల విజయవంతానికి అన్ని వర్గాలు సహకరించాలని జిల్లా కార్యదర్శి కె.లోకనాథం కోరారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సీపీఎం నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి పలు ఉద్యమాలు, పోరాటాలు చేస్తోందని, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, సహకార చక్కెర కర్మాగారాల ఆధునికీకరణ కోసం తమ పార్టీ అండగా నిలిచిన సంగతిని గుర్తు చేశారు. రంగాల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సీపీఎం అలుపెరుగని పోరాటాలు చేస్తోందన్నారు. చోడవరంలోని కల్యాణ మండపంలో జరగనున్న పార్టీ జిల్లా స్థాయి శిక్షణా తరగతుల నిర్వహణ, విజయవంతానికి స్థానిక ప్రజలు, వ్యాపార వర్గాలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు డి.వెంకన్న, ఎస్‌పీ నాయుడు, వీవీ శ్రీనివాసరావు, జి.నాయనబాబు, నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

కశింకోట: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం రాత్రి స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఘనంగా లోవాంబిక అమ్మవారి జాతర



లోవాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రాంబిల్లి : గోకివాడ గ్రామంలో మంగళవారం లోవాంబిక అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. గోకివాడ పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, సర్పంచ్ నీరుకొండ శారద సూర్యనారాయణ దంపతులు , ఎంపీటీసీ బాబ్జీ, గ్రామ నాయకులు ద్వారపురెడ్డి నానాజీ, ప్రసాద్‌తో పాటు పలువురు ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఘనంగా కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో కనకదుర్గమ్మ అమ్మవారు

కె.కోటపాడు: చౌడువాడ గ్రామంలోని కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయ 11వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరిపారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అమ్మవారికి పూజలు జరిపి, మొక్కులు చెల్లించుకున్నారు. వార్షికోత్సవ సందడితో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పులిబంటి అప్పారావు, నారంశెట్టి నర్సింగరావు, బంటు కనకారావు, గంగుమళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశుని సన్నిధిలో హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో కొలువైన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక హోమం నిర్వహించారు. ఉదయం నుంచి విశేష పూజలు, హోమాది కార్యక్రమాలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ రాపేట రామకొండారావు, ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ఆవరణలోని సుబ్రహ్మణ్యస్వామికి పూజలు నిర్వహించారు.

ఎన్ఎంఎంఎస్ విజేతలకు అభినందన



ఎన్ఎంఎంఎస్ ర్యాంకర్లను అభినందిస్తున్న ఎంఈవో రామారావు, ఉపాధ్యాయులు

కోటవురట్ల: రాజుపేట ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులు ఆదర్శంగా నిలుస్తున్నారని ఎంఈవో రామారావు కితాబునిచ్చారు. ఇటీవల నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ప్రతిభ చూపి స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థులు డి.యశస్విని, మళ్ల చార్మిళ, సూరిశెట్టి రష్మిత, తీడ రాజ్‌కుమార్, ఎత్తుల శివదుర్గలకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఎంఈవో మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో రాజుపేట పాఠశాలలో మెరుగైన ఫలితాలు రావడం అభినందనీయం అన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కూడా ఇదే పాఠశాలకు చెందిన రిషిత మండల టాపర్‌గా నిలవడంలో ఉపాధ్యాయుల కృషి ఉందన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివితే సాధించలేనిది ఉండదన్నారు. మిగతా పాఠశాలల్లో కూడా ఉపాధ్యాయులు మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం షేక్ ఖాలీషా, పేరెంట్ కమిటీ చైర్‌పర్సన్ ఆళ్ల శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



బీసీ కాలనీలో దోమలమందు పిచికారీ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక : ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక బీసీ కాలనీలో మంగళవారం జరుగుతున్న దోమలమందు పిచికారీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కడా దోమలు లేకుండా అవసరమయ్యే చర్యలు తీసుకుంటామన్నారు. దోమల నివారణపై దృష్టి సారిస్తున్నామన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రత్యేక బుట్టల్లో వేయడం ద్వారా దోమలు వృద్ధి చెందవన్నారు.

మునగపాకలో విద్యార్థి కిట్‌ల పంపిణీ



మునగపాక దళితవాడలో విద్యార్థి కిట్‌లను అందజేస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక : విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకోవాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక దళితవాడలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆయన మంగళవారం విద్యార్థి కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి కష్టపడి చదువుకోవాలన్నారు. తద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండడంతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయులు సేవలందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేడ పరీక్ష ద్వారా నులిపురుగుల నివారణ



రైతులతో ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రదీప్‌కుమార్

మునగపాక : పేడ పరీక్ష ద్వారా నులిపురుగుల సమస్య పరిష్కారం చేసుకోవచ్చని మునగపాక పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్ అన్నారు. రిలయన్స్ ఫౌండేషన్, పశు సంవర్ధక శాఖ సంయుక్త నిర్వహణలో మంగళవారం రైతులకు సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి పశువుకు నట్టల నివారణ మందులు వేయాలన్నారు. చూడితో ఉన్న పశువులకు కూడా కూడా నట్టల నివారణ మందు వేసుకోవచ్చన్నారు. పశువులకు ఎటువంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు,రామచంద్రరావు పాల్గొన్నారు.

తోటాడ హైస్కూల్ హెచ్‌ఎంగా సోమయాజులు

మునగపాక : మండలంలోని తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎంగా ఎస్.వి.ఎస్ సోమయాజులు నియమితులయ్యారు. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ నుంచి మంగళవారం ఉత్తర్వులు అందాయి. ఇంతవరకు తోటాడ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేసిన బి.కుమార్ గత నెలలో పదవీ విరమణ చేసిన సంగతి తెలసిందే. దీంతో ఆయన స్థానంలో సోమయాజులను నియమిస్తూ ఉత్తర్వులు అందినట్టు స్థానిక ఎంఆర్సీ కార్యాలయ ఉద్యోగి తెలిపారు.

ఘనంగా సన్యాసమ్మ తల్లి ఒడ్డు పండగ



సన్యాసమ్మ తల్లిని దర్శించుకుంటున్న గ్రామ పెద్దలు, భక్తులు



ప్రత్యేక అలంకరణలో సన్యాసమ్మ అమ్మవారు

దేవరాపల్లి: స్థానిక గ్రామ దేవత సన్యాసమ్మ తల్లి ఒడ్డు పండగ మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. తెల్లవారు జాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. పండగ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల తాకిడితో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితానాయుడు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తొలుత నిర్ణయించిన మేరకు జూన్ 4న జరగాల్సిన పండగను, ఓట్ల లెక్కింపు కారణంగా ఎన్నికల కోడ్ మేరకు ఇప్పుడు నిర్వహించారు. తీన్మార్ వాయిద్యాలు, డప్పులు, మేళతాళాలతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఆలయ ఆవరణలో ఆలయ కమిటీతో పాటు స్థానిక యువత, భక్తులు ప్రసాద వితరణ, మజ్జిగ, మంచినీరు అందించారు. ఆలయ ధర్మకర్త లలితానాయుడితోపాటు డా.వరదపురెడ్డి సింహాచలంనాయుడు, గండిపడాల అప్పలరాజు, కేవీ రమణ, మహేశ్వరినాయుడు, గొర్లె దేముళ్లు, చొక్కాకుల వెంకటరమణ, వరదపురెడ్డి చంద్రరావు, గంగవంశం సంతోష్, కొరుపోలు శ్రీను తదితర గ్రామ పెద్దలు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ



అనకాపల్లి గవరపాలెం కనకదుర్గ అమ్మవారి ఆలయంలో గోపూజ చేస్తున్న భక్తులు

కశింకోట : అనకాపల్లి గవరపాలెంలోని సతకంపట్టు వద్ద కొలువుదీరిన కనకదుర్గ అమ్మవారి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా రెండో రోజు మంగళవారం గోపూజ, దుర్గా మల్లేశ్వరస్వామి వారి హోమం, కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా వేద మంత్రాల నడుమ హోమం చేశారు. అనంతరం ఆవు, దూడలను నీళ్లతో శుభ్రం చేసి పసుపు, కుంకుమ అద్ది సంప్రదాయంగా పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, వ్యవస్థాపకుడు పి.వి. రమణ, కాండ్రేగుల నాయుడు, సన్యాసి నాయుడు, యల్లపు నాయుడు, కర్రి కల్యాణ్, శరగడం మోహన్ దంపతులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.